



ఎచ్చెర్ల: పరీక్ష రాసి బయటకు వస్తున్న డీఎస్సీ అభ్యర్థులు



ఎచ్చెర్ల: శ్రీ వెంకటేశ్వర కళాశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో తిరుమలచైతన్య

ప్రారంభమైన మెగా డీఎస్సీ

- తొలిరోజు నాలుగు కేంద్రాల్లో పరీక్షలు నిర్వహణ
- నిర్దేశిత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకున్న అభ్యర్థులు

ఎచ్చెర్ల/ నరసన్నపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ నెల 30 వరకు పరీక్షలు జరుగనున్నాయి. చాలా ఏళ్ల తర్వాత డీఎస్సీ నోటిఫికేషన్ రావడం, పోస్టుల భర్తీకి పరీక్షలు నిర్వహిస్తుండడంతో అభ్యర్థుల్లో ఆనందం కనిపించింది. నిర్దేశించిన సమయానికి రెండు గంటలు ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం), శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల), కోర్ టెక్నాలజీ (నరసన్నపేట), ఆదిత్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ మేనేజ్‌మెంటు(టెక్కలి)తోపాటు జీఎంఆర్ ఐటీ(రాజాం), ఎస్ఎం ఐటీ (ఒడిశా రాష్ట్రం బరంపూర్) కేంద్రాలను జిల్లా అభ్యర్థులకు కేటాయించారు. ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు రెండు షిఫ్ట్‌ల్లో పరీక్ష నిర్వహించారు. తొలిరోజు శుక్రవారం శ్రీ వెంకటేశ్వర, కోర్ టెక్నాలజీస్, జీఎంఆర్ ఐటీ, బరంపూర్ కేంద్రాల్లో టీజీటీ కేటగిరి పోస్టుల భర్తీకి (మిగతా 6వ పేజీలో..)



శ్రీకాకుళంలోని జామియా మసీదు

నేడు బక్రీద్

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగకు మసీదులు సిద్ధమయ్యాయి. శనివారం బక్రీద్‌ను పురస్కరించుకుని.. శ్రీకాకుళం జామియా మసీదును విద్యుత్ వెలుగులతో అలంకరించారు. జిల్లావ్యాప్తంగా పలు మసీదులను నమాజ్‌కు సిద్ధం చేశారు. బక్రీద్‌ను మతసామరస్యానికి ప్రతీకగా సోదరభావంతో జరుపుకోనున్నారు. జామియా మసీదులో శనివారం ఉదయం 8.30 గంటలకు సామూహిక నమాజ్ నిర్వహించనున్నామని, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొనాలని అక్బర్ బాషా, ఇమామ్‌వహాబ్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

- జిల్లాలో 34 మంది ఎంపిక
- ఈ నెల 9న రూ.20వేల చొప్పున నగదు బహుమతి ప్రదానం

6లో




మాట్లాడుతున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

‘రిమ్స్’లో మార్పు రావాలి

- కార్పొరేట్ తరహా వైద్యసేవలు అందించాలి
- ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలి
- ప్రతీనెలా ఆస్పత్రిని సందర్శిస్తా
- కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

అరసవల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ‘శ్రీకాకుళంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్- జీజీహెచ్)లో మరింత మెరుగైన వైద్యసేవలు అందించాలి. వైద్యులు, సిబ్బంది పనితీరులో మార్పు రావాలి. కార్పొరేట్ తరహాలో వైద్యసేవలు అందించి.. ప్రజల్లో విశ్వాసాన్ని నిలబెట్టాలి’ అని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆదేశించారు. శుక్రవారం ఆయన రిమ్స్‌ను సందర్శించారు. జీజీహెచ్ అభివృద్ధిపై కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి.. వైద్య కళాశాల సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ రిమ్స్‌లో సమస్యలను గుర్తించామని త్వరలోనే వాటిని పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. ‘వైద్య కళాశాల విద్యార్థులతో వచ్చే నెలలో ముఖాముఖీ నిర్వహిస్తాం. ఆసుపత్రి సామర్థ్యం పెరిగిన నేపథ్యంలో విద్యుత్, మురుగునీటి వ్యవస్థ బలోపేతానికి తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. సిబ్బంది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలి. ఆసుపత్రి భవనాలపై సౌర విద్యుత్ ప్యానెళ్ల ఏర్పాటు కోసం ప్రణాళికలు రూపొందించాల’ని అధికారులను కేంద్రమంత్రి ఆదేశించారు. 300కుపైగా ఏసీల నిర్వహణ, 60 కంప్యూటర్ల సంరక్షణ కోసం రూ.12.25 లక్షలు అవసరమని సూపరింటెండెంట్ డా.అమూల్య తెలిపారు. వివిధ విభాగాధిపతులు మాట్లాడుతూ గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణుడి అవసరం ఉందని, అలాగే మార్చురీ వద్ద ఆధునికీకరణ అవసరమని, 8 బాడీ కూలర్స్, ఫ్రీజర్లు, శవ పరీక్ష టేబుల్స్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. పీజీ విద్యార్థులు మాట్లాడుతూ గుండెపోటుతో వచ్చే రోగులకు పూర్తిస్థాయి సేవల కోసం అత్యవసర పరికరాలు (మిగతా 6వ పేజీలో..)



కంచిలి మండలం ఒరియా నారాయణపురం వద్ద ఎన్టీఆర్ సుజలధార రక్షితనీటి పథకం

సుజలధారకు రూ. 5.75 కోట్లు

- నిధుల విడుదలకు కేబినెట్ ఆమోదం
- ఉద్దానంలో తెరచుకోనున్న 135 కేంద్రాలు
- ప్రజలకు అందనున్న శుద్ధజలాలు

ఇచ్ఛాపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉద్దానం ప్రజల తాగునీటి కష్టాలు తీర్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని ఎన్టీఆర్ సుజలధార రక్షితనీటి పథకాల నిర్వహణకు సంబంధించి నిధులు మంజూరుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వం రూ.5.75కోట్ల విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీంతో రెండు నియోజకవర్గాల్లో మూతపడిన సుజలధార రక్షిత నీటి పథకాలు అందుబాటులోకి రానున్నాయి. ఉద్దానంలో కిడ్నీ వ్యాధుల వ్యాప్తికి తాగునీరు కలుషితం కావడం ఒక కారణమని అధ్యయనాలు తేల్చాయి. దీంతో టీడీపీ ప్రభుత్వం 2018లో ఎన్టీఆర్ సుజలధార పేరుతో ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లో రూ.14కోట్ల వ్యయంతో శుద్ధ జలాల ప్లాంట్లతోపాటు గ్రామాల్లో సరఫరా కేంద్రాలను ఏర్పాటు చేసింది. 20 లీటర్ల నీటిని రూ.2కే అందించేది. కొన్నాళ్లపాటు ఇవి బాగానే పనిచేశాయి. ఉద్దానం ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేవి. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి నిర్వహణను గాలికొదిలేసింది. ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం అంటూ హడావుడి చేసి.. వీటిని పూర్తిగా విస్మరించింది. దీంతో కొన్ని రక్షితనీటి పథకాలు మూతపడ్డాయి. కొన్ని పథకాలు నిర్వహణ సక్రమంగా లేక ఉద్దానం వాసులకు తాగునీటి కష్టాలు తప్పడం లేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం సుజలధార పథకాల నిర్వహణకు రూ.5.75కోట్ల నిధులు విడుదల చేయనుండడంతో కేంద్రాలు తెరచుకోనున్నాయి. ఉద్దానం వాసుల తాగునీటి కష్టాలు తీరనున్నాయి.

- ప్రారంభం ఇలా..

ఎన్టీఆర్ సుజలధార పథకాన్ని 2018లో ప్రారంభించారు. అప్పట్లో ఎన్టీర్ సుజలధార పథకం కుప్పం నియోజకవర్గానికి కేటాయించాల్సి ఉంది. కానీ నాడు మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవతో ఉద్దానంలో ఈ ట్యాంకులను నెలకొల్పారు. పలాస, వజ్రపుకొత్తూరు, మందస, కవిటి, కంచిలి, సోంపేట, ఇచ్ఛాపురంలో మండలానికి ఒకటి చొప్పున మదర్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఏడు మండలాల్లోని 135 గ్రామాల్లో సరఫరా కేంద్రాలను కూడా నెలకొల్పారు. మదర్‌ప్లాంట్ల నుంచి (మిగతా 6వ పేజీలో..)

హర్షణీయం



టీడీపీ హయాంలో ఉద్దానంలో ఎన్టీఆర్ సుజలధార శుద్ధ జలాల ప్లాంట్ల సేవలు విస్తృతంగా అందించేవి. కానీ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పూర్తిగా నిలిచిపోయాయి. నిర్వహణను ప్రభుత్వం గాలికొదిలేసింది. 20 లీటర్ల శుద్ధ జలాల క్యాన్ ధరను రూ.2 నుంచి రూ.7కు పెంచినా.. నిర్వహణ సక్రమంగా చేపట్టలేదు. తాజాగా ప్రభుత్వం నిధులు విడుదల చేయడం హర్షణీయం.

- కాళ్ల దిలీప్, 22వ వార్డు టీడీపీ కౌన్సిలర్, ఇచ్ఛాపురం

అన్ని కేంద్రాలు అందుబాటులోకి..



ఉద్దానానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడం ఆనందంగా ఉంది. వైసీపీ ప్రభుత్వం ఎన్టీఆర్ సుజలధార పథకాన్ని నిర్వీర్యం చేసింది. ఈ పథకానికి నిధులు కేటాయిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం. మూతపడిన అన్ని కేంద్రాలను అందుబాటులోకి తెస్తాం. ఎక్కడైనా శుద్ధజలాల ప్లాంట్లు పాడైతే ఫిర్యాదు చేయాలి. ఉద్దానం ప్రజలకు శుద్ధి జలాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- డాక్టర్ బెందాళం అశోక్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి.. వెనుక పోలీసులకు పట్టుబడిన రాజస్థాన్ ముఠా సభ్యులు

రాత్రివేళల్లో హైవేపై దోపిడీ

- బెదిరించి బైక్‌లు, డబ్బు, ఫోన్లు లాక్కెళ్తున్న వైనం
- ఎట్టకేలకు పోలీసులకు చిక్కిన ముఠా సభ్యులు
- నిందితులందరూ రాజస్థానీయులే

శ్రీకాకుళం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జాతీయ రహదారిపై రాత్రివేళల్లో ఆగి ఉన్న వాహనదారులను బెదిరించి.. వారి నుంచి నగదు, ఫోన్లు, బైక్‌లు దోచుకుంటున్న ముఠా సభ్యులు ఎట్టకేలకు పోలీసులకు చిక్కారు. ఈమేరకు శుక్రవారం శ్రీకాకుళంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి వివరాలు వెల్లడించారు. ‘రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ముఠా సభ్యులు.. జిల్లాలో రణస్థలం మండలం కోష్ట వద్ద టెంట్లు వేసుకుని తాత్కాలికంగా నివాసం ఏర్పాటు చేసుకున్నారు. రాత్రివేళల్లో హైవేపై నేరాలకు పాల్పడేవారు. బయట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలను కూడా ఎత్తుకుపోయేవారు. ఇటీవల ఆమదాలవలస నుంచి బొడ్డేపల్లి సతీష్‌కుమార్.. తన స్నేహితుడితో కలిసి నందిగాం మండలం కనితూరులో వివాహ వేడుకకు వెళ్లారు. రాత్రి తిరిగి వస్తుండగా వర్షం కురుస్తుండటంతో హైవేపై విక్రంపురం బస్‌షెల్టర్ వద్ద ద్విచక్ర వాహనాన్ని నిలిపి కాసేపు ఉన్నారు. రాజస్థాన్‌కు చెందిన ముఠా సభ్యులు.. వారిద్దరిపై దాడిచేశారు. కత్తులతో బెదిరించి వారి నుంచి రూ.6వేల నగదు, రెండు ఫోన్లు తీసుకుపోయారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందడంతో విచారణ చేపట్టారు. కోష్టలో నివాసముంటున్న రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌కు చెందిన ముఠా ఆదిత్య పవార్(22), బంగారం పవార్(21), సుధీర్ పవార్(19), శరత్ షిండే(14), సంజు షిండే ముఠాగా ఏర్పడి.. టెక్కలి, నందిగాం, నరసన్నపేట, లావేరు తదితర ప్రాంతాల్లో హైవేపై అర్ధరాత్రిళ్లు దోపిడీకి పాల్పడుతున్నట్లు గుర్తించారు. గురువారం సాయంత్రం టెక్కలి మండలం (మిగతా 7వ పేజీలో..)



పోలీసులు స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

పార్కింగ్ చేసిన వాహనాలే లక్ష్యం

- ఆపై ఇళ్లల్లో చోరీలు

7లో

పీడీఎంఎస్‌తో భూమికి ఆరోగ్యం

- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- ప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
- జిల్లాలో లక్ష ఎకరాల లక్ష్యం పెట్టుకున్న వైనం

6లో

కనులపండువగా శ్రీముఖలింగేశ్వరుని కల్యాణం

8లో

ప్రశాంతంగా ఏపీ పీజీఈ సెట్

7లో

ఈస్ట్ కోస్ట్ రైల్వే సలహా మండలి బోర్డు సభ్యుడిగా రాజేష్



జీవామృతం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ రైతులు

మూడు గ్రామాల్లో.. ప్రకృతి వ్యవసాయం

- 737 మంది రైతులు.. 676 ఎకరాల్లో సాగు

పోలాకి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పోలాకి మండలంలోని గొల్లలవలస, గాతలవలస, రహిమాన్‌పురం గ్రామస్థులు ప్రకృతి వ్యవసాయంలో ఆదర్శంగా నిలుస్తున్నారు. రాష్ట్ర సహజ వ్యవసాయ బృంద ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రకృతి సాగు చేపడుతున్నారు. ప్రకృతి సాగుకు సంబంధించి ఈ మూడు గ్రామాల్లో 737 మంది రైతులను ఎంపిక చేశారు. మండల యూనిట్ ఇన్‌చార్జిగా బొడ్డేపల్లి సీతారామయ్యతో పాటు మరో ఐదుగురు సభ్యులు వారికి ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నారు. మొత్తంగా 676 ఎకరాల్లో కూరగాయలు తదితర పంటలను సహజ సిద్ధంగా పండిస్తున్నారు. జీవామృతం, ఘనామృతం, నవధాన్యాలు, వాణిజ్య పంటల విత్తనాలను రైతులతో తయారు చేయించారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇటీవల ముందస్తు ఎరువుగా సాగు నిమిత్తం 321 మంది రైతులకు నవధాన్యాలను పంపిణీ చేశారు. రైతులు పండించిన కూరగాయలను ఇటీవల తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రదర్శించారు. సాగులో ఉత్తమ రైతులను గుర్తించి.. సత్కరించామని ప్రకృతి వ్యవసాయశాఖ మండల యూనిట్ ఇన్‌చార్జి సీతారామయ్య, బృందసభ్యులు వండాన రమణమూర్తి, పి.జ్యోతి, ధనలక్ష్మి తెలిపారు.

విషం లేని ఆహారం

- ప్రకృతి సాగుద్వారా అందిస్తున్న రైతులు
- రసాయనాలు లేకుండా పండిస్తున్న వైనం
- ప్రతిపటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
- నేడు ప్రపంచ సురక్షిత ఆహార దినోత్సవం

6లో

● మెళియాపుట్టి మండలం
కొసమాళ గ్రామానికి చెందిన సీహెచ్ జమున, చంద్రారావు దంపతులకు 1.45 ఎకరాల పొలం ఉంది. నాలుగేళ్ల క్రితం 25 సెంట్లలో ప్రకృతి వ్యవసాయం మొదలు పెట్టారు. తొలుత తమ ఇంటి అవసరాల కోసం కూరగాయలు పండించారు. రసాయనాలు వాడలేదు. దీంతో కుటుంబం ఆరోగ్యంగా ఉండడంతో ఈ ఏడాది నుంచి 1.45 ఎకరాల్లో కాకర, బీర, బెండ, వంగ, దోస, చొత్తికూర, తోటకూర వేస్తున్నారు. మెట్ట కావడంతో ప్రతిఏటా ఏదో ఒక విపత్తుతో నష్టపోయేవారు. ప్రకృతి విధానంలో సీజనల్ కూరలు పండించటంతో మంచి ఆదాయంతో పాటు ఆరోగ్యం కూడా కలిసి వస్తోందని ఈ రైతు దంపతులు చెబుతున్నారు. సమయానికి కషాయం చల్లితే దోమపోటు ఉండదంటున్నారు. ప్రస్తుతం ఏటా రూ.1.2 లక్షల ఆదాయం వస్తోందని, పెట్టుబడి పోను రూ.లక్ష దాకా మిగులుతోందని తెలిపారు. రసాయన వ్యవసాయం చేసేటప్పుడు పెట్టుబడి రూ.60వేల దాకా పెట్టుబడి వచ్చేదని, కేవలం రూ.50వేలు మాత్రమే మిగిలేదని అన్నారు.

● మెళియాపుట్టి మండలం
కొసమాళ గ్రామానికి చెందిన సరిపురం లక్ష్మినారాయణ అనే రైతు నాలుగేళ్లు నుంచి ప్రకృతి వ్యవసాయం ద్వారా వరి పండిస్తున్నారు. ఈయన పండించిన ధాన్యం కోసం వినియోగదారులు ముందే అడ్వాన్స్ ఇచ్చి వెళ్తున్నారు. కారణం రసాయన ఎరువులు వేయకుండా, క్రిమిసంహారక మందులు చల్లకుండా సాగు చేయడమే కారణం.



విషంలేని ఆహారం

● ప్రకృతి సాగుద్వారా అందిస్తున్న రైతులు
● రసాయనాలు లేకుండా పండిస్తున్న వైనం
● ప్రతిఏటా పెరుగుతున్న సాగు విస్తీర్ణం
● నేడు ప్రపంచ సురక్షిత ఆహార దినోత్సవం

వారు ప్రకృతి సంరక్షకులు. పర్యావరణ పరిరక్షకులు. నిస్సారమైన భూమిని కాపాడుతున్న వారు. ఆహారం విషతుల్యమై వ్యాధుల బారిన పడుతున్న వారికి ఆపద్బాంధవులు. మనకు సురక్షిత ఆహారం అందించే అన్నదాతలు. జిల్లాలో ప్రతిఏటా ప్రకృతి వ్యవసాయం చేసేవారి సంఖ్య అధికమవుతోంది. సాగు విస్తీర్ణం కూడా పెరుగుతోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఆ రైతులను ప్రోత్సహిస్తున్నాయి. శనివారం ప్రపంచ సురక్షిత ఆహారం దినోత్సవం పురస్కరించుకుని అలాంటి రైతుల సాగు విధానాలపై కొన్ని కథనాలు..

మెళియాపుట్టి/పాతపట్నం/ఎచ్చెర్ల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. విభిన్న పంటలను రైతులు సాగు చేసేలా ప్రోత్సహించేందుకు నేషన్ మిషన్ అండ్ న్యాచురల్ ఫార్మింగ్‌ను ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై రైతులకు అవగాహన కల్పించేందుకు ప్రతి మండలంలో ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలను నియమించింది. ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకృతి వ్యవసాయం కోసం నిధులు కూడా కేటాయిస్తోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో గత ఏడాది వరకు 60 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తుండగా ఈ ఏడాది లక్ష ఎకరాలకు పెంచాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం 30 మండలాల్లో 70 వేల మంది రైతులను గుర్తించించినట్లు చెబుతున్నారు. పాతపట్నం, ఎచ్చెర్ల, ఆమదాలవలస, కోటబొమ్మాళి, మెళియాపుట్టి, కొత్తూరు, హిరమండలం, నందిగాం మండలాల్లో అధికంగా రసాయనాలు లేకుండా కూరగాయలు సాగు చేస్తున్నారు. వీటిని విక్రయించడానికి జిల్లా కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద ప్రతి సోమవారం ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేశారు.

20 సెంట్లలో ప్రతినెలా రూ.20 వేలు

ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక ఆదాయం పొందుతున్నానని కరకవలస దుర్గాప్రసాదరావు తెలిపారు. పాతపట్నం మండలం గంగువాడ పంచాయతీ పి.గోపాలపురం గ్రామానికి చెందిన ఈయనకు ఎనిమిది ఎకరాల పొలం ఉంది. 2006 నుంచి రసాయనిక ఎరువులకు స్వస్తి పలికారు. ఆ సంవత్సరంలో ఆయన తల్లి అనారోగ్యానికి గురై బైపాస్ సర్జరీ చేయించుకోవాల్సి వచ్చింది. అలాగే తన కుటుంబంలో ఒకరు క్యాన్సర్ బారినపడ్డారు. వీటన్నింటికీ కారణం రసాయనిక ఎరువుల వినియోగాలేనని గుర్తించారు. దీంతో సుభాష్ పాలేకర్ ప్రకృతి సాగుపై శిక్షణ పొందారు. ముందుగా ఒక ఎకరాతో మొదలు పెట్టగా మెరుగైన ఫలితాలు వచ్చాయి. 2018లో భూమిలో నవధాన్యాలు వేసి పూత దశలోనే భూమిని కలియదున్నారు. అప్పటి నుంచి అనూహ్యంగా దిగుబడి పెరిగింది. అనంతరం నవధాన్యాలు 9, 18, 21, 30 రకాలు భూమిలో వేయడం.. పెరిగాక కలియదున్నడం ప్రారంభించారు. భూమిలో గాలి గదులు ఏర్పడి నీటి నిల్వలు పెరిగాయి. రసాయనిక ఎరువులు వాడే పొలాలు కన్నా తమ పొలాలే మంచిగా ఉన్నాయని, తక్కువ వర్షం వచ్చినా అధిక దిగుబడులు సాధించామని ఆ రైతు చెబుతున్నారు. 20సెంట్లలో ఏటీఎం మోడల్ ద్వారా కూరగాయల సాగుతో నెలకు రూ.18వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం వస్తున్నట్లు తెలిపారు. దీంతో చాలామంది రైతులు ఇప్పుడిప్పుడే ప్రకృతి సాగువైపు ఆసక్తి చూపిస్తున్నారని, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు కూడా తన పొలాన్ని సందర్శించారని ఆ రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

● మెళియాపుట్టి మండలం జోడూరు గ్రామానికి చెందిన ధర్మారావు అనే రైతుకు 4 ఎకరాల మెట్ట పొలం ఉంది. ఒక ఎకరాలో కూరగాయలు ప్రకృతిసిద్ధంగా పండిస్తున్నారు. దీంతో వినియోగదారులు పొలం వద్దకే వచ్చి కొనుగోలు చేసుకుని వెళ్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం రావడంతో పాటు కుటుంబం అంతా ఆరోగ్యకరమైన ఆహారం తీసుకుంటున్నామని ఆ రైతు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎకరాలో కూరగాయలకు రూ.70వేలు, మూడు ఎకరాల్లో ధాన్యం వేస్తే రూ.1.53 లక్షల ఆదాయం వస్తోందని తెలిపారు.

12 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయమే


ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో మిర్చి సాగుచేస్తున్న అన్నారావు

దిగుబడి తక్కువగా వస్తున్నా, కలుషితం కాని ఆహారం తినడం కోసం ప్రకృతి వ్యవసాయానికే అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నారు. గత 12 ఏళ్లగా తనతో పాటు సోదరునికి ఉన్న మొత్తం 4 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడాయన. ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు పంచాయతీ లావేటిపాలెం గ్రామానికి చెందిన లావేటి అన్నారావు తన సోదరుడు ఆనందరావుతో కలిసి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లోనే వరి, మిర్చి, అరటి, కొబ్బరితో పాటు వంగ, బెండ, బీర పండిస్తున్నారు. సాధారణంగా ఎకరాలో అధిక డబ్బులు వెచ్చించి రసాయనిక ఎరువులు వేసి వరి సాగుచేస్తే 35 బస్తాల వరకు దిగుబడి వస్తే, అతి తక్కువ పెట్టుబడితో ప్రకృతి వ్యవసాయం ద్వారా 25 నుంచి 28 బస్తాల దిగుబడి వస్తున్నట్లు లావేటి అన్నారావు తెలిపారు. మిర్చి 10 క్వింటాళ్లు దిగుబడి వస్తున్నట్టు చెప్పారు. ప్రకృతి సాగులో పెట్టుబడి చాలా తక్కువని, ఆహారం ఆరోగ్యకరంగా ఉంటుందని చెబుతున్నారు.


కొనమాల జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం (ఫైల్)


కొనమాలలో ప్రకృతి వ్యవసాయ ద్వారా సాగు చేస్తున్న కూరగాయలు

పీడీఎంఎస్‌తో భూమికి ఆరోగ్యం

● తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
● ప్రకృతి సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
● రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు
● జిల్లాలో లక్ష ఎకరాల లక్ష్యం పెట్టుకున్న వైనం


జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ

పాత శ్రీకాకుళం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రసాయన ఎరువుల మితిమీరి వాడకం వల్ల వ్యవసాయ భూములు నిస్సారమై పోతున్నాయి. దీనివల్ల పంటలకు తెగుళ్ల వ్యాపిస్తున్నాయి. మందులు పిచికారీ చేయడం వల్ల పంట ఉత్పత్తులు విషతుల్యమై పోతున్నాయి. వీటిని తిన్న మనం కూడా వ్యాధుల బారిన పడుతున్నాము. వీటిని అరికట్టాలంటే ప్రకృతి లేదా సేంద్రియ సాగు ఉత్తమని నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం కూడా ఆదిశగా ప్రోత్సాహం ఇస్తోంది. భూమిలో సేంద్రియ కర్బనశాతం పెంచుకోవడానికి పీఎండీఎస్ (ప్రీ మాన్సూన్ డ్రై సోవింగ్) ఒక ఉత్తమమైన మార్గమని ప్రకృతి వ్యవసాయం జిల్లా అధికారులు చెబుతున్నారు. ఈ పద్ధతి వల్ల భూమిలో జీవవైవిధ్యం పెరిగి.. మొక్కలకు అవసరమైన పోషకాలు లభిస్తాయి. ఈ విధానం గురించి ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

● పీఎండీఎస్ అంటే వర్షాకాలం ప్రారంభానికి ముందు పొలాల్లో వివిధ రకాల విత్తనాలు వేసే ప్రక్రియ. మార్చి, ఏప్రిల్, మే, జూన్ నెలల్లో పంటలు లేకపోవడం ఉష్ణోగ్రతలు పెరిగి భూమి పైపొరలలో ఉన్న సేంద్రియ కర్బనం తగ్గిపోతుంది. భూముల్లో సారవంతం పోతుంది. భూమి 365 రోజులూ పచ్చదనంతో ఉండాలి. దీనివల్ల సేంద్రియ కర్బనం చెడిపోకుండా ఉంటుంది. నీటి నిల్వ సామర్థ్యం పెరిగి పంటలు బాగా పండుతాయి. వర్షకాలం ముందే ఖాళీ భూములను పచ్చదనంతో నింపేందుకు, భూమి ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు పీఎండీఎస్‌ను జిల్లా ప్రకృతి వ్యవసాయం అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చని వారు చెబుతున్నారు. పీఎండీఎస్ విధానంలో 9, 21, 30 రకాల పంటలను పొలంలో వేయడం వల్ల మట్టిలో జీవవైవిధ్యం పెరుగుతుంది. దీనివల్ల తెగుళ్ల, కీటకాల ప్రభావం తగ్గుతుంది. పీఎండీఎస్‌లో నవధాన్యాలు, నూనెగింజలు, తీగజాతి రకాల పంటలు, ఆకుకూరలు ఉంటాయి. విత్తనాలను గుళికల రూపంలో తయారుచేసి, వర్షం పడగానే మొలకెత్తేలా చేయాలి.

లక్ష ఎకరాల లక్ష్యం

ఏపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఈ పథకంలో జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయశాఖ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. జాతీయ స్థాయిలో అందుతున్న పథకాలతో పాటు రాష్ట్ర స్థాయిలో ఏపీసీఎన్ఎఫ్‌తో కలిసి పీఎండీఎస్ టార్గెట్ పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. జిల్లాలో లక్ష ఎకరాల్లో పీఎండీఎస్ వేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటి వరకు పదివేల కిట్లు రైతులకు అందించారు.

● రసాయనాల బదుల దేశీయ ఆవు మూత్రం, పేడ, సున్నంతో తయారైన బీజమృతం ద్వారా విత్తనశుద్ధి చేస్తే మొలకశాతం మెరుగుపడుతుంది. దేశీయ రకాలకు వ్యాధినిరోధక శక్తి ఎక్కువ. దీనికి బీజామృతం కలిపితే రక్షణ కవచంలా పనిచేస్తుంది.

● ప్రకృతి వ్యవసాయంలో పశుపోషణ కూడా భాగం. దేశీయ ఆవుల పెంపకానికి సబ్సిడీలు, ఆవుల దాణాకు 50శాతం సబ్సిడీ ప్రభుత్వం ఇస్తోంది. మినీ గోకులాలు ఏర్పాటు చేస్తోంది. ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయల అందించేందుకు ప్రభుత్వ ఆఫీసుల వద్ద ప్రతి సోమవారం, గురువారం స్టాల్స్ ఏర్పాటు చేస్తోంది.

● భూమి లోపల జీవవైవిధ్యం పెరగడం వల్ల దీర్ఘకాలిక దిగుబడి మెరుగవుతుంది. కలుపు మొక్కలు తగ్గుతాయి. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. ప్రకృతి వ్యవసాయంతో రైతులకు ఖర్చు తగ్గుతుంది. భవిష్యత్తు వ్యవసాయం సుస్థిరంగా మారుతుంది. ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి ఉన్న రైతులు తమ గ్రామంలోని ఐసీఆర్‌పీలు లేదా డీపీఎం కార్యాలయాన్ని సంప్రదించవచ్చని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పూజారి సత్యనారాయణ తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు ప్రతిభ అవార్డులు

● జిల్లాలో 34 మంది ఎంపిక


అంధ విద్యార్థి ఢిల్లీశ్వరరావును అభినందిస్తున్న కళాశాల అధ్యాపకులు, ప్రిన్సిపాల్

నరసన్నపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు నగదు పురస్కారాలను అందించి ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లా అధికారుల ప్రతిపాదనలు మేరకు ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో చదివి, ఉత్తమ ఫలితాలు సాధించిన 34 మంది ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులను ప్రతిభా పురస్కారాలకు ఎంపిక చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఒక్కో విద్యార్థికి రూ.20వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నది. ఈ పురస్కారాలను ఈనెల 9న ప్రదానం చేయనున్నట్టు ఇంటర్ విద్యాశాఖ అధికారులు తెలిపారు. జిల్లా నుంచి ఎంపికైన వారు వీరే.. గొట్టాపు ప్రియంక (కాశీబుగ్గ), రెయ్య లిఖిత (సింగుపురం), ఉపమాక సాయిహారిక (శ్రీకాకుళం), షేక్ రుషిద్ (ఇచ్ఛాపురం), మలపాక లక్ష్మీలిఖిత(శ్రీకాకుళం), సవర సుస్మిత (సింగుపురం), కె.పద్మజ (పలాస), కొండా మీనాక్షి (బారువ) ఎం.సాయిఅభిరామ్(బలగ) ఎ.మధులత(శ్రీకాకుళం), ఎస్.సబీర్ (మందస), కె.లక్ష్మీప్రియ (పలాస), ఎస్.సుధీర్(టెక్కలి), కె.యుగంధర్(పలాస), ఎస్.ప్రదీప్ (టెక్కలి), వీఎస్ఎస్ కృష్ణప్రవల్లిక (బలగ) కె. జగదీష్ (పురుషోత్తపురం), సీహెచ్.స్వాతి (నరసన్నపేట), సాధు హేమాంజలి(పాతశ్రీకాకుళం), ఎం.వీ సూర్యశ్రీస్వాయిత (బలగ), పి.సిద్ధు (సింగుపురం) పి.జోసఫ్‌శామ్యూల్ (శ్రీకాకుళం), నగరి హన్సిక (పలాస), డి.అలేఖ్య (సోంపేట), డి.స్వప్న, కె.సాయి (ఆమదాలవలస), ఫాతిమా తివేశం(పాతశ్రీకాకుళం) బి.అంజలి (బలగ), సవర రాజ్ కుమార్ (టెక్కలి), కె.రూప (కరవంజి), పి.ఢిల్లీశ్వరరావు (నరసన్నపేట), బి.దేవశ్రీ (పాతపట్నం), కె.జ్ఞానేశ్వరి (శ్రీకాకుళం), డి.అరుణ (సోంపేట).

అంధ విద్యార్థికి..

నరసన్నపేటలోని జ్ఞానజ్యోతి జూనియర్ కళాశాలలో ఇంటర్ సీఈసీ చదివిన అంధ విద్యార్థి ఎం.ఢిల్లీశ్వరరావు ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ విద్యార్థికి చిన్న తనం నుండి కళ్లు 90శాతం కనిపించడం లేదు. అయినా చదువుపై మక్కువతో తల్లిదండ్రులు రోజూ కళాశాలకు తీసువచ్చి చదివించేవారు. స్క్రైబ్ సాయంతో పరీక్షలు రాస్తూ పదోతరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచాడు. ఇంటర్‌లో 80శాతం మార్కులు సాధించి ప్రతిభా పురస్కారానికి ఎంపికయ్యాడు. ప్రిన్సిపాల్ వి.ప్రవీణ్ ఢిల్లీశ్వరరావును, తల్లిదండ్రులను అభినందించారు.

మేజర్‌కు డిప్యూటీ సీఎం అభినందన


మేజర్ రామ్‌గోపాలనాయుడును అభినందిస్తున్న పవన్ కల్యాణ్

సంతబొమ్మాళి, జూన్6(ఆంధ్రజ్యోతి): ఇటీవల కీర్తిచక్ర పురస్కారం అందుకున్న మండలంలోని నగిరిపెంట గ్రామానికి చెందిన ఆర్మీ మేజర్ మల్ల రామ్‌గోపాలనాయుడును డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అభినందించారు. గురువారం రాత్రి విజయవాడలో రామ్‌గోపాలనాయుడు కుటుంబ సభ్యులతో పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. దేశ రక్షణలో రామ్‌గోపాలనాయుడు చూపిన ధైర్య సాహసాలను ఆయన కొనియాడారు. యువత రామ్‌గోపాలనాయుడును ఆదర్శంగా తీసుకొని రక్షణ రంగంలో రాణించాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించినట్టు మేజర్ తండ్రి మల్ల అప్పలనాయుడు తెలిపారు.

వైభవంగా శివ బాలాజీ కల్యాణోత్సవం


స్వామివారి కల్యాణం నిర్వహస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో శివబాలాజీ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్వామిఆరి కల్యాణోత్సవం వైభవంగా సాగింది. ఈ సందర్భంగా విశేష అలంకరణ, విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం, విశేష మండపారాధన, హోమాలు, అనంతరం తిరువీధి నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గోపినింబాల వెంకట సీతారామాచార్యులు, సత్య కూర్మాచార్యులు, శ్రీమనారాయణ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పాత శ్రీకాకుళంలోని దూదివారి కోవెలలో వేంకటేశ్వరస్వామికి అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. ఉమారుద్రకోటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు ఆరవెల్లి శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణం జరిగింది.

ప్రారంభమైన మెగా డీఎస్సీ

(ఐదో పేజీ తరువాయి)

పరీక్ష నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కేంద్రాన్ని డీఈవో డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య పరిశీలించారు. వెంకటేశ్వర ఇంజనీరింగ్ కేంద్రంలో 100 మంది చొప్పున అభ్యర్థులకు ఉదయం షిఫ్ట్‌లో 90 మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లో 95 మంది హాజరయ్యారు.


నరసన్నపేటలో కేంద్రం వద్ద డీఎస్సీ అభ్యర్థులు

● నరసన్నపేటలోని కోర్ టెక్నాలజీ కేంద్రంలో 320 మంది చొప్పున అభ్యర్థులకుగానూ ఉదయం 295 మంది, మధ్యాహ్నం 278 మంది హాజరయ్యారని పరీక్షల పర్యవేక్షకుడు, ఎంఈవో పి.దాలినాయుడు తెలిపారు. శుక్రవారం పలువురు అభ్యర్థులు గుర్తింపు కార్డులు తీసుకురాకపోవడంతో నెట్ కేంద్రాలకు పరుగులు తీశారు. తప్పనిసరిగా ఒరిజినల్ గుర్తింపు కార్డులు తీసుకురావాలని ఎంఈవో సూచించారు.

సుజలధారకు రూ.5.75 కోట్లు

(ఐదో పేజీ తరువాయి)

సరఫరా కేంద్రాలకు శుద్ధజలాలను తరలించేందుకు స్టీల్ కంటైనర్లతో ట్రాక్టర్ ట్యాంకర్లను ఏర్పాటు చేశారు. కానీ వైసీపీ హయాంలో నిర్వహణ లేక సగానికిపైగా సరఫరా కేంద్రాలు మూతపడ్డాయి. టీడీపీ ప్రభుత్వ హయాంలో 20 లీటర్ల క్యాన్ ధర రూ.2 ఉండగా.. నిర్వహణ వ్యయం పేరిట వైసీపీ సర్కారు దానిని రూ.7కు పెంచింది. ప్రజలపై అదనపు భారం మోపింది. కుటుంబానికి రోజుకు సగటున మూడు క్యాన్లు అవసరం. అంటే తాగునీటికి రోజుకు రూ.21 ఖర్చు చేయాల్సి వచ్చింది. అయినా వాటి నిర్వహణలో వైసీపీ ప్రభుత్వం విఫలమవడంతో ప్రజలకు శాపంగా మారింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవడంపై ఉద్దానం ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'రిమ్స్'లో మార్పు రావాలి

(ఐదో పేజీ తరువాయి)

అందుబాటులోకి తేవాలని కోరారు.

రూ.45లక్షల వైద్యపరికరాలు

కేంద్రమంత్రి చొరవతో కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)లో భాగంగా బోయింగ్ ఇండియా సంస్థ రిమ్స్‌కు రూ.45లక్షల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను అందజేసింది. శుక్రవారం ఆ పరికరాలను కేంద్రమంత్రి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించే దిశగా ముందడుగు పడిందన్నారు. కార్పొరేట్ తరహా వైద్యసేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని తెలిపారు. ప్రతీనెలా ఆస్పత్రిని సందర్శిస్తానన్నారు. ఆస్పత్రిలో పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, సేవల్లో మార్పు తీసుకురావాలని స్పష్టం చేశారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ కేవలం ఆరు వారాల్లో బోయింగ్ సీఎస్ఆర్ నిధుల ద్వారా ఆసుపత్రికి పరికరాలు అందడం గొప్ప విషయం. కనీసం 15 ఏళ్లపాటు పనిచేసేలా ఒప్పందం చేసుకుంటే దీర్ఘకాలిక ప్రయోజనం ఉంటుందని తెలిపారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ ఈ పరికరాలతో ఆసుపత్రికి కొత్త ఆక్సిజన్ లభించిందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్రంలోనే ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు కృషిచేద్దామని తెలిపారు. ఆసుపత్రి అడ్మిన్ డాక్టర్ రాజశేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి వెంకటాచలం, బోయింగ్ ఇండియా నుంచి డా.ప్రవీణ్, డా.రజత్, అమృత, రోహిత్, జీజీహెచ్ వైద్యులు డా.మురళీకృష్ణ, సూపరింటెండెంట్ డా.అమూల్య పాల్గొన్నారు.

యోగాతో మానసిక సమస్యల పరిష్కారం


యోగాసనాలు వేస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, జూన్ 6(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక సమస్యలు పరిష్కారమవుతాయని... సంపూర్ణ ఆరోగ్యంగా ఉండేందుకు దోహదం చేస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్‌లో సచివాలయ సిబ్బంది, మున్సిపల్, రెవెన్యూ అధికారులతో యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష గంట పాటు యోగాసనాలు వేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ యోగాను ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లారని కీర్తించారు. ప్రస్తుతం అన్ని దేశాల్లోనూ యోగా కార్యక్రమాన్ని నిర్వహించడం విశేషమన్నారు. ఆర్డీవో జి.వెంకటేష్, కమిషనర్ ఎన్.రామారావు, టీడీపీ నాయకులు గాలి కృష్ణారావు, ఎం.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ముర్రాటలతో..

పొందూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కొంచాడలో అసిరితల్లి పండగలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. చినకొంచాడ, కాపుకొంచాడ గ్రామాల నుంచి వందలాదిమంది మహిళాభక్తులు అమ్మవారికి ముర్రాటలు సమర్పించుకున్నారు.

జిల్లా ప్రతిష్టను ఇనుమడింపజేయాలి

● కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు

శ్రీకాకుళం స్పోర్ట్స్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు జిల్లా ప్రతిష్టను మరింత ఇనుమడింపజేయాలని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఒడిశా రాష్ట్రం కటక్ వేదికగా గత నెల 30 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ తైక్వాండో పోటీల్లో సత్తాచాటిన జిల్లాకు చెందిన క్రీడాకారులను శుక్రవారం కేంద్ర మంత్రిని కలిసిశారు. వివిధ విభాగాల్లో 28 పతకాలను సాధించడంపై ఆయన హర్షం వ్యక్తంచేశారు. కోచ్‌లు గౌతమ్, నవీన్, వంశీ, మేనేజర్ హేమంత్, ఖాన్ తదితరులను అభినందించారు. తైక్వాండో శ్రీను, టీడీపీ నాయకులు మెండ దాసునాయుడు, కొర్ను ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.


కేంద్రమంత్రితో జాతీయ స్థాయిలో ప్రతిభ చూపిన తైక్వాండో క్రీడాకారులు

తీరని రైతుబజారు కల

- రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు
- నిరంతరం ట్రాఫిక్ సమస్య
- పట్టించుకోని యంత్రాంగం
- ఇచ్ఛాపురం వాసులకు తప్పని కష్టాలు



ఇరుకు రోడ్డులోనే ఇలా..

ఇచ్ఛాపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలో రైతుబజారు ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. దీంతో రైతులు, వ్యాపారులు రోడ్డుకిరువైపులా, జంక్షన్లలో కూరగాయలు విక్రయించాల్సిన పరిస్థితి నెలకొంది. దీనివల్ల తరచూ ట్రాఫిక్‌కు అంతరాయంతో పాటు పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు సరైన మార్కెట్ సదుపాయం లేకుండా పోతోంది. 2019 ఆగస్టు 8న అప్పటి సీఎం జగన్ శాసనసభలో రాష్ట్ర వ్యాప్తంగా 100 రైతుబజార్లు ఏర్పాటు చేస్తున్నా మని ప్రకటించారు. ఆ జాబితాలో ఇచ్ఛాపురం పట్టణానికి చోటిస్తూ కల్పిస్తున్నట్టు స్వయంగా సభలో వెల్లడించారు. ఇందుకుగాను రూ.50 లక్షలు కేటాయిస్తున్న ట్టు చెప్పుకొచ్చారు. దీంతో స్థానిక వైసీపీ నేతలు సైతం ప్రకటనలు అప్పట్లో హడావుడి చేశారు. కానీ కార్యరూపం దాల్చలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా రైతు బజారునకు సంబంధించి ఎటువంటి కార్యాచరణ ప్రారంభం కాలేదు. దీంతో పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత టీడీపీ హయాంలో రైతుబజారు నిర్మాణానికి అడుగులు పడ్డాయి. ఇంతలో ఎన్నికలు రావడం, అధికార మార్పిడి జరగడం పూర్తయింది. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ నేతలు కూడా పెద్దగా పట్టించుకోలేదు. రైతు బజారుకు అనువైన ప్రాంతాలు ఉన్నా వైసీపీ ప్రభుత్వం గుర్తించడంలో విఫలమైంది. దీంతో రైతులు, వ్యాపారులకు ఇబ్బందులు తప్పలేదు. అటు ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి.



రోడ్డు పక్కనే కూరగాయాల విక్రయాలు

బస్టాండ్ ప్రాంగణంలో..

ఇచ్ఛాపురం పట్టణంలో రైతుబజారు లేకపోవడంతో రహదారులపైనే కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. ఒక వైపు మైదానం, మరోవైపు ఉద్యానం, ఇంకోవైపు తీర ప్రాంతం ఉండడంతో రైతులు వ్యవసాయ ఉత్పత్తులు, మత్స్యకారులు చేపలను తెచ్చి విక్రయిస్తుంటారు. అటు ఒడిశా వాసులు సైతం అటవీ ఉత్పత్తులు అమ్ముతుంటారు. వీరికి సరైన మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో దళారుల బారిన పడుతున్నారు. మరోవైపు రహదారులపై షాపులు వెలుస్తుండడంతో ట్రాఫిక్‌కు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. బస్టాండ్ ప్రాంగణంలో అయితే కూరగాయల దుకాణాలతో వాహనాలు కూడా నిలుపుకునే దుస్థితి లేదు. రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్న దళారులు అధిక ధరకు విక్రయిస్తున్నారు. అటు పట్టణ వాసులకు తాజా కూరగాయలు దొరకని పరిస్థితి. దీంతో బాధలు తప్పడం లేదు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వం స్పందించాల్సిన అవసరం ఉంది.

కాలయాపన చేశారు

ఇచ్ఛాపురంలో రైతుబజారు ఏర్పాటు చేయకపోవడం దారుణం. గత ఐదేళ్లుగా అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేశారే తప్పా.. నిర్మించిన దాఖలాలు లేవు. దీంతో రోడ్లపైనే కూరగాయల విక్రయాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. కూటమి ప్రభుత్వమైనా రైతుబజారు నిర్మాణం చేపట్టాలి.

- కె.దిలీప్, ఇచ్ఛాపురం పట్టణం

దళారులపాలు

రైతులు రోడ్లపై కూరగాయలను విక్రయించుకోవాల్సి వస్తోంది. దీంతో దళారులు ఎంతకు అడిగితే అంతకు పంటను విక్రయించుకుం టున్నా రు. అదే రైతుబజారు ఉంటే అటు రైతులకు ప్రయోజనం చేకూరు తుంది. కొనుగోలుదారులకు గిట్టుబాటు అవుతుంది. సామాన్య, మధ్య తరగతి ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన కూరగాయలు లభిస్తాయి. అందుకే రైతుబజారు ఏర్పాటుచేసి ఆదుకోవాలి.

- కొరాయి ధర్మరాజు, టీడీపీ నాయకులు, స్థానికుడు, ఇచ్ఛాపురం



పార్కింగ్ చేసిన వాహనాలే లక్ష్యం

- ఆపై ఇళ్లల్లో చోరీలు
- వేర్వేరు ఘటనల్లో పోలీసులను చూసి పరుగెత్తి పట్టుబడిన ఇద్దరు దొంగలు
- 15 బైక్‌లు, రూ.5.5లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ మహేశ్వరరెడ్డి



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

శ్రీకాకుళం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు చోట్ల పార్కింగ్ చేసిన వాహనాలను ఎత్తుకువెళ్లిపోవడం.. తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడడం వారు వృత్తిగా ఎంచుకున్నారు. ఈ క్రమంలో పోలీసులను చూసి పారిపోతూ చిక్కి, కటకటాలపాలయ్యారు. ఇందుకు సంబంధించిన వివరాలను జిల్లా పోలీసుకార్యాలయంలో శుక్రవారం ఎస్పీ మహేశ్వరరెడ్డి వెల్లడించారు. సారవకోట మండలం బుడితి గ్రామానికి చెందిన కొర్ల శివ అలియాస్ మున్నా, రణస్థలం మండలం పాతసుందరపాలెం గ్రామానికి చెందిన బస్వా సుధాకరరెడ్డి వేర్వేరుగా పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం బుడితి జంక్షన్ సమీపంలోని ఓ రైస్ మిల్ వద్ద పోలీసులను చూసి కొర్ల శివ పారిపోతున్నాడు. అతడిని వెంబడించి పోలీసులు పట్టుకున్నారు. ఇటు శ్రీకాకుళం రూరల్ స్టేషన్ పరిధి పాత్రునివలస ఫ్లైఓవర్ అండర్ పాసేజ్ కింద బస్వా సుధాకరరెడ్డి అక్కడే ఉన్న పోలీసులను చూసి పెరిగెత్తాడు. దీంతో అతడ్ని పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఈ ఇద్దరిని పోలీసులు విచారించగా పలు విషయాలు వెలుగుచూశాయి. సారవకోట, జలుమూరు, ఎచ్చెర్ల, జేఆర్ పురం, శ్రీకాకుళం, లావేరు, నరసన్నపేట, విజయనగరం జిల్లా డెంకాడ ప్రాంతాల్లో పార్కింగ్ చేసిన బైక్‌లనే లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నట్టు గుర్తించారు. పలు ఇళ్లల్లో చోరీకి పాల్పడి బంగారు, వెండి ఆభరణాలను దోచుకుపోయినట్టు విచారణలో తేలింది. వీరిద్దరిపై కేసు నమోదు చేశారు. వీరి నుంచి రూ.18లక్షలు విలువ గల 15 బైక్‌లు, రూ.5.5 లక్షలు విలువగల బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులో ప్రతిభ చూపిన ఏఎస్పీ శ్రీనివాసరావు, నరసన్నపేట సీఐ శ్రీనివాసరావు, సారవకోట ఎస్ఐ అనిల్, శ్రీకాకుళం రూరల్ ఎస్ఐ సూర్య చంద్రమౌళిను ఎస్పీ అభినందించారు.

దక్షిణ కోస్తా రైల్వేజోన్ జీఎం నియామకం హర్షణీయం

- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

శ్రీకాకుళం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నం దక్షిణ కోస్తా రైల్వేజోన్‌కు మరో ముందడుగు పడిందని.. రైల్వే జోన్‌కు తొలి జీఎంగా సందీప్ మాథుర్‌ను కేంద్రప్రభుత్వం నియమించడం హర్షణీయమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఏర్పాటు శరవేగంగా జరుగుతుందని చెప్పారు. రైల్వే జోన్ సేవలు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెచ్చేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని వివరించారు. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా రైల్వే జోన్ పనులు నిలిచిపోయాయని విమర్శించారు. జోన్‌కు అవసరమైన 54 ఎకరాల భూమి కేటాయించకుండా నిర్లక్ష్యం వహించారని.. దీనివల్ల వైసీపీ ఉత్తరాంధ్రకు తీవ్ర అన్యాయం చేసిందని దుయ్యబట్టారు. విశాఖ రైల్వే జోన్‌పై గజిట్ నోటిఫికేషన్ త్వరలో ఇచ్చేలా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందన్నారు.

శుభపరిణామం: ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస, జూన్ 6(ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తా రైల్వేజోన్ తొలి జీఎంగా సందీప్ మథుర్‌ను నియమించడం శుభపరిణామమని ఎమ్మెల్యే కూన రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రైల్వేజోన్ ఏర్పాటుకు ప్రత్యేక చొరవ తీసుకున్న కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. పనులు వేగవంతం అయ్యేందుకు ఈ నియామకం దోహదపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విశాఖపట్నంలో స్థలం కేటాయించి పనులు కూడా వేగవంతం చేసేందుకు కృషి చేసిందని, రూ.149 కోట్ల వ్యయంతో తొమ్మిది అంతస్తులతో రైల్వే జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణం కూడా జరుగుతుందన్నారు. గడిచిన 12 నెలల కాలంలో రూ.75 వేల కోట్ల నేషనల్ హైవే ప్రాజెక్టులు, రూ.72 వేల కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులను కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకొచ్చి రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తున్నారన్నారు.

సమస్యలు తెలుసుకొనేందుకు ప్రజాదర్బార్



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

రణస్థలం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకే ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం పైడిభీమవరంలో నిర్వహించిన దర్బార్‌లో ఎమ్మెల్యే పాల్గొని వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సింకు భవాని, రౌతు శ్రీనివాసరావు, వడ్డాది శ్రీనివాసరావు, మునకాల రామిరెడ్డి, పిన్నింటి భానోజీనాయుడు, పిసిని జగన్నాథం నాయుడు, గొర్లె లక్ష్మణరావు పాల్గొన్నారు

మహిళా ఫిర్యాదుదారులతో గౌరవంగా ప్రవర్తించాలి



మహిళా పోలీసు స్టేషన్‌లో ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మహిళా పోలీసు స్టేషన్‌కు సమస్యలతో వచ్చే మహిళా ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం ఆయన నగరంలోని మహిళా పోలీసు స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లో రిసెప్షన్ కేంద్రం, రికార్డుల నిర్వహణ తదితరాలను పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నచిన్న గొడవలతో వచ్చే భార్యభర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చి, సంసారాన్ని చక్కదిద్దేలా చొరవ తీసుకోవాలన్నారు. విధి నిర్వహణలో క్రమశిక్షణ పాటించాలని సూచించారు.

నూతన వసతులతో శిశుగృహం ప్రారంభం

అరసవల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరంలోని శిశుగృహాన్ని నవీకరించి, నూతన వసతులతో బాలసదనంలో ఏర్పాటు చేసిన శిశుగృహాన్ని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. శిశువుల అవసరాలకు అనుగుణంగా, మెరుగైన సేవలను అందించేలా కృషి చేయాలని సూచించారు. బాలసదనంలో పిల్లలతో ముచ్చటించి, వారి సమస్యలు, అవసరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు.శంకర్, ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, డీసీపీవో రమణ, పుణ్యవతి, నరేష్, దాసునాయుడు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

జనసేన పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా

ఆమలవలస, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ సభ్యత్వంతో కార్యకర్తలకు భరోసా లభిస్తుందని ఆ పార్టీ నాయకుడు కోరుకొండ మల్లేశ్వరరావు అన్నారు. శుక్రవారం నిమ్మతొర్లాడ గ్రామంలో జనసేన నాయకులతో కలిసి ఇంటింటికి వెళ్లి సభ్యత్వ నమోదు కార్డులను పంపిణీ చేశారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ కార్యకర్తల కుటుంబాలకు భరోసా కల్పించేలా సభ్యత్వ కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. మీసాల రాజనాయుడు, బుల్లిబాబు, సోమరాజు, రవికుమార్, లీలా మోహన్, గణేష్, మజ్జి వాసు, హరీష్, జగదీష్, ప్రశాంత్, సత్యం పాల్గొన్నారు.

నేటి నుంచి జగన్నాథస్వామి కల్యాణోత్సవాలు



ఇచ్ఛాపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పెద్ద జగన్నాథస్వామి దేవాలయంలో రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి పాంచహ్నిక దివ్యతిరుకల్యాణ మహోత్సవాలు శనివారం నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు ఆలయ మేనేజర్ బెండి రామారావు తెలిపారు. శనివారం వేకువ జామునుంచే ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అనంతరం స్వామి వారి దివ్య తీరు కల్యాణ మహోత్సవం, విశేష హోమాలు జరుగుతాయని తెలిపారు. కాగా శుక్రవారం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ఆసనాలు వేస్తున్న అధికారులు, విద్యార్థులు

సరుబుజ్జిలి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): యోగా చేయడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంపీడీవో ఎం.పావని తెలిపారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం విద్యార్థులు, పలు శాఖల సిబ్బంది యోగాసనాలు వేశారు. తన నిత్య జీవితంలో యోగాను ప్రత్యేక అంశంగా భావించాలని సూచించారు.

యోగాతో ప్రశాంతత

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): యోగాతో శారీరక, మానసిక ప్రశాంతత లభిస్తుందని సోషల్ వెల్ఫేర్ డీడీ విశ్వమోహన్ రెడ్డి అన్నారు. ఆ శాఖ ఆధ్వర్యంలో నగరంలోని 80 అడుగుల రోడ్డులో సుమారు 200 మందితో యోగాంధ్రలో భాగంగా శుక్రవారం యోగా కార్యక్రమం నిర్వహించారు.

నేడు బౌద్ధక్షేత్రంపై యోగాంధ్ర

గార, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ శాలిహుండ బౌద్ధక్షేత్రం వద్ద శనివారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు యోగాంధ్ర నిర్వహిం చనున్నట్టు ఎంపీడీవో ఎస్.రామ్మోహనరావు, తహసీల్దార్ ఎం.చక్రవర్తి తెలిపారు.

కంచమ్మను దర్శించుకున్న అడిషనల్ డీజీపీ



అడిషనల్ డీజీపీతో ఆలయ కమిటీ ప్రతినిధులు

కంచిలి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కంచమ్మతల్లి సంబరాల సందర్భంగా అడిషనల్ డీజీపీ (గ్రేహౌండ్, కర్నూలు) పండి సీతారామ్మూర్తి శుక్రవారం రాత్రి అమ్మవారిని దర్శించుకున్నారు. పూజాకమిటీ ఆధ్వర్యంలో ఆయన్ని సత్కరించి, అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు. జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, ధర్మాన కృష్ణదాసు, సీదిరి అప్పలరాజు తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆమదాలవలస, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. శుక్రవారం తొగరాంలో వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు.

- బూర్జ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కొల్లివలస పంచాయతీ రైతు భరోసా కేంద్రం వద్ద రాయితీపై టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పిల్లా కన్నంనాయుడు ఆధ్వర్యంలో రాయితీపై విత్తనాలన పంపిణీ చేశారు. పార్టీ నాయకులు శివప్రసాద్, తమ్మిన సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఏపీ పీజీఈ సెట్

ఎచ్చెర్ల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎంటెక్, ఎం.ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ పీజీఈ సెట్-2025 పరీక్షలు శుక్రవారం ప్రారంభయ్యాయి. టీసీఎస్ సాంకేతిక సాయంతో మూడు రోజుల పాటు ఈ పరీక్షలు జరగనున్నాయి. శ్రీ శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో ఉదయం షిఫ్ట్‌లో 155కు 136 మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లో 166కు 144 మంది విద్యార్థులు హాజరయ్యారు.

కొనసాగుతున్న ఐటీఐ అడ్మిషన్ కౌన్సెలింగ్

ఎచ్చెర్ల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశానికి ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో అడ్మిషన్ కౌన్సెలింగ్ కొనసాగుతుంది. రెండో రోజైన శుక్రవారం 284 మందిని కౌన్సెలింగ్‌కు పిలవగా, 128 మంది హాజరై 83 మంది వివిధ ట్రేడ్‌ల్లో సీట్లు పొందారు. శనివారం 563 నుంచి 858 ర్యాంకు వరకు 295 మంది అభ్యర్థులను కౌన్సెలింగ్ హాజరుకావాలని పిలిచారు. ఈ కౌన్సెలింగ్ జిల్లా ఉపాధి కల్పన శాఖాధికారి కె.సుధ, జిల్లా కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సధాకరరావు పర్యవేక్షణలో నిర్వహిస్తున్నారు.

మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలి



చీకటపేటలో మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రణస్థలం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని, అనుమానస్పద వ్యక్తులు తీరం వెంబడి సంచరిస్తే సమాచారం ఇవ్వాలని కళింగపట్నం మెరైన్ ఎస్ఐ జి.హరికృష్ణ అన్నారు. గురయ్యపేట, చీకటపేట, పోతయ్యపేట, దోనిపేట గ్రామాల్లో శుక్రవారం మత్స్యకారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనుమానితులు తారాసపడితే వెనువెంటనే 1093 టోల్ ఫ్రీ నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. చేపలవేటకు వేళ్లే సమయంలో మత్స్యకారులు తీసుకోవల్సిన జాగ్రత్తల కోసం వివరించారు. కార్యక్రమంలో పలువురు మత్స్యకారులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన జీవనం అవసరం

ఆమదాలవలస, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యవంతమైన జీవనశైలికి యోగా అవసరమని మునిసిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం నుంచి యోగా అవగాహనా ర్యాలీను మునిసిపల్ సిబ్బందితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ర్యాలీ ద్వారా ప్రజల్లో యోగా వల్ల కలిగే లాభాలను అవగాహన పెంపొందించేందుకు తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ తమ్మినేని గోవిందరావు, సీనియర్ అసిస్టెంట్ చక్రవర్తి, పురపాలక సచివాలయ మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక బక్రీద్

శ్రీకాకుళం క్రైం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీక బక్రీద్ (ఈదుల్ అజ్ హా) అని, కుల, మతాలకు అతీతంగా సోదరభావంతో, శాంతియుతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి శుక్రవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలను తెలిపారు. బక్రీద్ పండగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భద్రతా ఏర్పాట్లు చేయాలని సంబంధిత పోలీసు స్టేషన్ల ఇన్‌చార్జీలను ఆదేశించినట్టు తెలిపారు. ముఖ్యమైన మసీదుల వద్ద డ్రోన్స్, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మతాలు, కులాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే సమాచారాన్ని, గోవధ, పశువుల అక్రమ రవాణా చేస్తే డయల్ 100, 112, లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ స్పష్టం చేశారు.

ఈస్ట్ కోస్ట్ రైల్వే సలహా మండలి బోర్డు సభ్యుడిగా రాజేష్



రాజేష్

శ్రీకాకుళం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఈస్ట్ కోస్ట్ రైల్వే డివిజన్ సలహా మండలి సభ్యుడిగా శ్రీకాకుళం ప్రాంతానికి చెందిన డాక్టర్ బుడుమూరు రాజేష్ నియమితులయ్యారు. భారత రైల్వే మంత్రిత్వ శాఖ సూచనలు మేరకు ఈస్ట్ కోస్ట్ డివిజన్ సంప్రదింపుల సలహామండలి ఇటీవల ఏర్పాటైంది. ప్రతిష్ఠాత్మకమైన ఈ బోర్డులో రాజేష్‌కు చోటు లభించింది. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలోని రైల్వే స్టేషన్‌లు ఆధునికీకరణ, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించే విషయంలో సూచనలు సలహామండలిలో అందించేందుకు వీలుంటుంది. ఈనెల 24న సలహా మండలి సమావేశంలో పలు సూచనలు ఇవ్వనున్నట్లు బోర్డుసభ్యులు రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ రైల్వే స్టేషన్ అభివృద్ధికి ప్రత్యేకంగా కృషి చేస్తానన్నారు. ఆయన నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

వైభవంగా ఆదిత్యుని కల్యాణం

అరసవల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి కల్యాణం శుక్రవారం వైభవంగా జరిగింది. జ్యేష్ఠ శుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ అనివెట్టి మండపంలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ వైభవంగా నిర్వహించారు కార్యక్రమంలో ఇప్పిలి సాందీపశర్మ, ఫణీంద్రశర్మ, వికాస్‌శర్మ, ఈవో వై భద్రాజీ , పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామికి ఏకాదశి పూజలు



గార, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి సందర్భంగా ప్రసిద్ధ శ్వేతగిరిపై వెలసిన కాలీయ మర్దన వేణుగోపాలస్వామికి శుక్రవారం సుప్రభాతసేవ, క్షీరాభిషేకం నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ సుగ్గు మధురెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు సుగ్గు లక్ష్మి నరసింహదేవి దంపతుల ఆధ్వర్యంలో అర్చకులు ఆరవెల్లి ఆనంద్ కాశ్యప్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రతీ సమస్యను పరిష్కరిస్తా

అరసవల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రతీ సమస్యను అధికారులతో చర్చించి పరిష్కారం చూపిస్తానని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతలను స్వీకరించారు. అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వ ప్రాధాన్యమిస్తుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్య కర్తలు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

రాత్రివేళల్లో.. హైవేపై దోపిడీ

(ఐదో పేజీ తరువాయి)

శ్యామసుందరాపురం వద్ద పోలీసులు మకాం వేసి.. రాజస్థాన్ ముఠా పట్టుకున్నారు. పట్టుబడిన నిందితుల్లో పవార్ అని పేర్లుగల ముగ్గురూ సొంత అన్నదమ్ములు అని తేలింది. మరో నిందితుడు సంజు షిండే పరారీలో ఉన్నాడు. నిందితులను అరెస్ట్ చేసి.. వారి నుంచి రూ.1.12 లక్షల నగదు, రెండు బైక్‌లు, 8 ఫోన్లు, 6 కత్తులు స్వాధీనం చేసుకున్నామ'ని ఎస్పీ మహేశ్వరరెడ్డి తెలిపారు. కేసులో పురోగతి చూపిన ఇన్‌స్పెక్టర్లు విజయ్‌కుమార్, చంద్రమౌళి, ఎస్ఐ మధుసూదనరావు, హెచ్‌సీ శ్యామ్, కానిస్టేబుళ్లు లోకనాథం, సంతోష్‌కుమార్, ఉమామహేశ్వరరావు, ప్రసాదరావు, భాస్కరరావును ప్రత్యేకంగా అభినందించారు.

ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

బూర్జ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఓవీ పేట ఆదర్శ పాఠశాల, కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 7, 8, 9 తరగతులు, ఇంటర్‌లోని ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ నెల 10వ తేదీ నుంచి 20వ తేదీలోగా ఏపీసీఎఫ్ఎస్ఎస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం రాత పరీక్ష, ఉత్తీర్ణత ద్వారా సీట్లను భర్తీ చేస్తామన్నారు.

మిగులు సీట్ల భర్తీకి..

కవిటి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాజపురం ఆదర్శ పాఠశాలలో మిగులు సీట్ల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు తెలిపారు. పాఠశాలలో 7,8,9 తరగతులతో పాటు ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 10నుంచి 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసిన వారికి ఈ నెల 24న ప్రవేశపరీక్ష నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

9న ఐటీఐలో అప్రెంటీస్ మేళా

ఎచ్చెర్ల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 9న ప్రధానమంత్రి జాతీయ అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకరరావు తెలిపారు. ఐటీఐలో ఏదైనా ట్రేడ్‌లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మేళాకు మూడు బయోడేటా ఫారాలు, మూడు కలర్ ఫోటోలు, ఐటీఐ, పదో తరగతి, ఆధార్ కార్డుల జెరాక్స్‌ల మూడు సెట్లతో హాజరుకావాలన్నారు. అరబిందో, శ్యాంపిస్టన్స్, నాగార్జున అగ్రికెమ్, అపోలో టైర్స్, ఎస్ఆర్ఎంటీ తదితర కంపెనీల్లో అప్రెంటీస్ కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్విజ్ విజేతలకు బహుమతులు

ఇచ్ఛాపురం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడం కోసమే వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని గ్రంథాలయ అధికారి పూర్ణచంద్ర బెహరా అన్నారు ఈ మేరకు శుక్రవారం నిర్వహించిన క్విజ్ పోటీలకు విశేష స్పందన లభించింది. పట్టణ పరిధిలో గల అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు లొద్దపుట్టి జడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సురేష్‌చంద్ర పండా బహుమతులు అందజేశారు. గ్రంథాలయ సహాయకులు ఎస్ఎన్ బెహరా, పాఠకులు పి.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపకారవేతనాలకు ఎంపిక

కవిటి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులు జాతీయ మెరిట్ ఉపకారవేతనాలకు ఎంపికైనట్టు హెచ్ఎం ఎస్.రామకృష్ణ తెలిపారు. పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థులు నాలుగేళ్లపాటు ఉపకారవేతనాన్ని అందుకోనున్నారన్నారు. వీరిని ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఏడాదిలో పలాస-కాశీబుగ్గకు తాగునీరు ఇచ్చాం: ఎమ్మెల్యే శిరీష


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, జూన్ 6(ఆంధ్రజ్యోతి): 'పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ పేరుతో యుద్ధం చేసి విజయం సాధించామని... దానికి గుర్తుగా పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో తాగునీరు అందించేందుకు నిర్దేశించిన పథకానికి 'సిందూర జలసిరి' అని పేరు పెట్టడాన్ని అదృష్టంగా భావిస్తున్నామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది లోపే జంట పట్టణాలలో శాశ్వత తాగునీటి పథకం ప్రారంభించామని అన్నారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో 'సిందూర జలసిరి' కార్యక్రమంపై ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన తాగునీరు తీసుకువచ్చామని చెప్పారు. గతంలో పలాస మీదుగా జల జీవన్ మిషన్ ద్వారా నీరు వెళ్తున్నా వైసీపీ పాలకుల చేతకాని తనం వల్ల నీరు ఇవ్వలేదని విమర్శించారు. తాము అధికారం చేపట్టిన వెంటనే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి... తాగునీరు రప్పించామన్నారు. ఇప్పటి వరకూ 60 శాతం మందికి కుళాయిలతో నీరు అందిస్తున్నారని తెలిపారు. మిగిలిన వారికి కూడా నీరు అందించేందుకు అధికారులు ప్రణాళికబద్ధంగా వెళ్లాలని సూచించారు. సూదికొండకాలనీ, రోటరీనగర్, శివాజీనగర్‌తో పాటు మరికొన్ని వార్డులకు యుద్ధ ప్రాతిపదికన నీరు ఇవ్వాలని ఆమె ఆదేశించారు. పైపులైన్ల కోసం రూ.150 కోట్లు ఖర్చవుతుందని అధికారులు చెప్పడంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు రప్పించుకుందామని తెలిపారు. కిడ్నీ పరిశోధన కేంద్రం, 200 పడకల ఆసుపత్రికి కూడా ఉద్దానం నీరు వెళ్లే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి సంబంధించిన అంచనాలు సిద్ధం చేయాలని కోరారు. సమావేశంలో కమిషనర్ ఎన్.రామారావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రంగప్రసాద్, డీఈఈ ఆశాలత, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి

పలాస రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. కాంట్రగడలో శుక్రవారం రూ.10లక్షల నిధులతో మంజూరైన రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీరుకట్ల విఠల్‌రావు, సర్పంచ్ ఎస్.తిరుమలరావు, ఎంపీడీవో వసంత్‌కుమార్, ఏవో పోలారావు, కార్యదర్శి సద్గుణరాజు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే బగ్గు


రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వం ధ్యేయమని స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. చల్లవానిపేట సొసైటీలో శుక్రవారం రాయితీపై వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకోవడానికి రాయితీపై విత్తనాలు, ఎరువులతో పాటు వ్యవసాయ పనిముట్లు అందిస్తుందన్నారు. వైసీపీ పాలనలో రైతు సంక్షేమం విస్మరించినందున అన్నివిధాలా నష్టపోయారన్నారు. ఈ ఏడాది రైతులకు అందుబాటులో ఉండేవిధంగా వరి విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో విక్రయిస్తున్నట్లు తెలిపారు. రైతులు సద్వినియోగ పరచుకొని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నరసన్నపేట నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, మండల పార్టీ అధ్యక్షుడువెలమల రాజేంద్రనాయుడు, మండల కన్వీనర్ బగ్గు గోవిందరావు, చల్లవానిపేట, లింగాలవలస సర్పంచ్‌లు పంచిరెడ్డి రామచంద్రరావు, దుంగ స్వామిబాబు, వ్యవసాయ మార్కెట్‌కమిటీ అధ్యక్షుడు తర్ర బలరాం, నాయకులు గురుబెల్లి ఝాన్సీ దేవ, వ్యవసాయాధికారి కె.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండేందుకే...

తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించడానికే మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం ప్రారంభించినట్లు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. జలుమూరులో శుక్రవారం టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి సోమవారం, బుధవారం, శనివారం పార్టీ కార్యాలయంలో అందుబాటులో ఉంటానన్నారు. కార్యకర్తలు తమ సమస్యలు తెలియజేస్తే మండల స్థాయి నాయకులు అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎం.దామోదరరావు, దత్తుబాబు, గంగాధర్, భైరి భాస్కరరావు, టి.సతీష్‌కుమార్, బగ్గు గోవిందరావు, జుత్తు అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం కాని సమావేశాలెందుకు?


నేలపై కూర్చొని నిరసన తెలుపుతున్న సత్యనారాయణ

ఎల్.ఎన్.పేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): 'అధికారులు, సచివాలయ సిబ్బంది పనితీరు సంతృప్తికరంగా లేదు. సమస్యలు పరిష్కరించలేనపుడు సమావేశాలెందుకు?' అంటూ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశం వాడీవేడిగా సాగింది. గృహ నిర్మాణశాఖ ఏఈ రమేష్ కాలనీ ఇళ్ల బిల్లుల కోసం తెలియజేస్తుండగా.. యంబరాం సర్పంచ్ గోవిందరావు, కరకవలస సర్పంచ్ యోగీశ్వరరావులు నిలదీశారు. లబ్ధిదారులు బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పౌర సరఫరాల శాఖ పనితీరుపై ఆర్ఐ ఎస్.గవరయ్య వివరిస్తుండగా చింతలబడవంజ సర్పంచ్ ప్రతినిధి వి.సత్యనారాయణ అడ్డు తగిలారు. ప్రభుత్వ భూమిలో ఆక్రమణదారుడు పంటలు పండించుకుంటున్నారని... దీన్ని అడ్డుకోవాలని జిల్లా అధికారులు ఆదేశించినా... సిబ్బంది పరిష్కరించడం లేదని ఆరోపించారు. హిరమండలం వంశధార ఫేజ్-2 ప్రాజెక్టులో నిర్వాసితులకు చింతలబడవంజ వద్ద పునరావాస కాలనీ స్థలాల సమస్యను పరిష్కరించలేదని సర్పంచ్ ప్రతినిధి సత్యనారాయణ, యంబరాం సర్పంచ్ గోవిందరావు తదితరులు ఆర్ఐని నిలదీశారు. సరైన సమాధానం రాకపోవటంతో వేదిక ముందు సత్యనారాయణ భైఠాయించి నిరసన తెలిపారు. ఎంపీపీ జ్యోతిలక్ష్మి, ఎంపీడీఓ శ్రీనివాసరావులు కలుగజేసుకొని నాలుగైదు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని ఆర్ఐతో హామీ ఇప్పించడంతో శాంతించారు. అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది సమయ పాలన పాటించడం లేదని సభ్యులు సభ దృష్టికి తెచ్చారు. నెలవారీ సమావేశాలు జరిగినప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలు డబ్బులు కలెక్షన్ చేసి..పీవోకు అందజేసి రికార్డుల్లో సంతకాలు చేయించుకుంటున్నారని యంబరాం సర్పంచ్ వి.గోవిందరావు, టీకేపురం సర్పంచ్ ఎం.యోగీశ్వరి పీవో విమలకుమారిపై ధ్వజమెత్తారు. విద్యుత్‌శాఖ తీరుపైనా ఇదే స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. సమావేశంలో జెడ్‌పీటీసీ సభ్యుడు కె.త్రినాథులు, మండల ప్రత్యేకాహ్వానితులు ఆర్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

17.450 కిలోల గంజాయితో వ్యక్తి అరెస్ట్


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ చిన్నమనాయుడు

ఇచ్ఛాపురం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రం గంజాం జిల్లా నుంచి ముంబయికి తరలిస్తున్న 17 కేజీల 450 గ్రాముల గంజాయిని పట్టణ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు శుక్రవారం సర్కిల్ కార్యాలయంలో సీఐ మీసాల చిన్నమనాయుడు వివరాలు వెల్లడించారు. గంజాం జిలా ఖరియాగూడ్ పంచాయతీకి చెందిన చాబి సాహు జీవనోపాధి కోసం కుటుంబంతో ముంబయి వెళ్లిపోయాడు. అక్కడ గంజాయి వ్యాపారం చేసే అంకుష్ అనే వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఒడిశా నుంచి గంజాయి తెచ్చి ఇస్తే కేజీకి రూ.8 వేలు ఇస్తానని చెప్పడంతో ఆశపడి గంజాయిని పట్టుకెళ్లి ఇచ్చేవాడు. ఈ క్రమంలో ఒడిశాలోని ఆనంద సాహు వద్ద కేజీ రూ.3వేలు చొప్పున 17.450 కిలోల గంజాయిని కొనుగోలు చేసి వాటిని 8 ప్యాకెట్లుగా చేశాడు. ఆనంద్ సాహు సాయంతో ఇచ్ఛాపురం చేరుకున్నాడు. గంజాయి తరలిస్తున్నట్లు పట్టణ ఎస్సై ముకుందరావుకి సమాచారం రావడంతో రైల్వే స్టేషన్‌కు వెళ్లారు. అక్కడ రైలు ఎక్కేందుకు సిద్ధంగా ఉన్న చాబిసాహు అనుమానాస్పదంగా కనిపించటంతో తనిఖీలు చేశారు. అతని వద్ద గంజాయిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి సోంపేట కోర్టుకు రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ముకుందరావు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

జలుమూరు (సారవకోట), జూన్ 6: (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపురంలో శుక్రవారం పిడుగుపడి ఆవు మృతి చెందింది. గ్రామస్థుల కథనం మేరకు సాధు అప్పలనాయుడి పొలంలోని ఆవుపై శుక్రవారం పిడుగు పడింది. దీంతో మూగజీవి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది.

అధికారులు అందుబాటులో ఉండాలి: ఎమ్మెల్యే


విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అధికారులు రైతులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయ ప్రాంగణంలో రాయితీపై వ్యవసాయ పనిముట్లు, విత్తనాలను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో విత్తనాలు, ఎరువులు సరఫరా చేసేలా అందుబాటులో ఉంచుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు పైల బాబ్జీ, నేతలు శివాల చిన్నయ్య, కలమట భుజంగరావు, మండల వ్యవసాయాధికారి కింజరాపు రవికుమార్, ఎంపీడీవో పి.చంద్రకుమారి తదితరులు పాల్గొన్నారు.

రైల్వేజోన్‌కు మహర్దశ

విశాఖపట్నం డివిజన్ రైల్వేజోన్‌కు మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో విలేకరులతో శుక్రవారం మాట్లాడుతూ వైసీపీ నిర్లక్ష్యధోరణే రైల్వేజోన్ ఆలస్యానికి కారణంగా వివరించారు. కూటమి ప్రభుత్వ పాలనలో విశాఖ డివిజన్ ఏర్పాటుకు కదలిక వచ్చిందన్నారు. రూ.148 కోట్ల వ్యయంతో తొమ్మిది అంతస్తుల భవనం నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు టి.తిరుపతిరావు, పి.బాబ్జీ పాల్గొన్నారు.

వేడుకగా జడ్డమ్మతల్లి ఆలయ ప్రారంభం


హోమం నిర్వహిస్తున్న దృశ్యం

నందిగాం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాంపురం పంచాయతీ చిన్న లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన జడ్డమ్మ తల్లి అమ్మవారి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ వేడుకగా నిర్వహించారు. పురోహితులు పశుపతి ప్రసాదరావుశర్మ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. ఆలయ ప్రారంభంతో పాటు విగ్రహ, యంత్ర, శిఖర ప్రతిష్ఠను భక్తుల కోలాహలం మధ్య నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ చేశారు. కూటమి నాయకులు పి.అజయ్‌కుమార్, ఎస్.జానకిరాం, కె.ధర్మారావు, కూరాకుల యాదవ్, బి.గిరిబాబు, కె.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణతో ఆర్థికాభివృద్ధి


కుట్టు శిక్షణకు హాజరైన మహిళలు

టెక్కలి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా అమలు చేస్తున్న కుట్టుమిషన్ల శిక్షణ దోహదపడుతుం దని మండల దేశం పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరిరావు అన్నారు. స్థానిక అంబేద్కర్ భవనంలో ఉచిత కుట్టు శిక్షణా తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ జిల్లా ఇన్‌చార్జి చంద్రశేఖర్, టీడీపీ నాయకులు మామిడి రాము, పోలాకి షణ్ముఖరావు, బసవల అప్పలస్వామి, మెండ దమయంతి, కాశీ బెహరా, కృష్ణవేణి, రెయ్యి ప్రీతీష్, దల్లి ప్రసాద్‌రెడ్డి, పేర మురళి తదితరులు పాల్గొన్నారు.

పలాసలో స్తంభించిన ట్రాఫిక్


భారీగా నిలిచిపోయిన వాహనాలు

పలాస, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పాత జాతీయ రహదారి, రైల్వే స్టేషన్ రోడ్డులో శుక్రవారం మధ్యాహ్నం వాహనాలు నిలిచిపోవడంతో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. టీకేఆర్ కల్యాణ మండపం నుంచి కాశీబుగ్గ మూడు రోడ్ల జంక్షన్, రైల్వే స్టేషన్ రోడ్ జంక్షన్ వాహనాలతో నిండిపోయాయి. గంటపాటు మండుటెండలో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పాత జాతీయ రహదారిపైనే వాహనాలు పార్కింగ్ చేయడం, భారీ వాహనాలను రోడ్లపైనే పెడుతున్న కారణంగా నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

కనులపండువగా శ్రీముఖలింగేశ్వరుని కల్యాణం


కల్యాణానికి సిద్ధమైన ఉత్సవమూర్తులు

జలుమూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగేశ్వర స్వామి కల్యాణం శుక్రవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. పాంచరాత్ర కల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. ముందుగా కొట్నం దంచారు. పీనిమట్టి తీసుకొచ్చి..శతమానం తయారుచేశారు. రాత్రి 7 గంటలకు పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను నంది వాహనంపై ఊరేగించారు. అనంతరం గ్రామ పురోహితులు బంకుపల్లి భూషణశర్మ ఆధ్వర్యంలో దేవదాయ శాఖ అధికారులు, అర్చకులు కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఈ కల్యాణ మహోత్సవంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, శివ, శ్రీకృష్ణ, అప్పారావు, అచ్యుత, దేవదాయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

శ్రీముఖలింగంలో కొలువు తీరిన శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణాన్ని శుక్రవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. అర్చకులు విశ్వనాథదాస్, ప్రసాద్ పాఢి ఆధ్వర్యంలో పురోహితులు జనార్దన శర్మ స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, పరిషత్ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో పి.ప్రభాకరరావు, దేవదాయ సిబ్బంది, పలువురు భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పెంటపోలమ్మ జాతర


అమ్మవారికి తొలి బొట్టు పెడుతూ..

పలాస, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెంటపోలమ్మ అమ్మవారి జాతర శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. పదో వార్డు పొందరవీధిలో అమ్మవారి ఆలయాన్ని రంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఉదయం 4 గంటల నుంచి అమ్మవారికి మంగళస్నానాలు, పూజలు, అభిషేకాలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఐదు వార్డులకు సంబంధించిన అమ్మవారి జాతర కావడంతో అన్నీ వీధుల్లో విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. వారికి ఇబ్బంది లేకుండా ఉత్సవ కమిటీ ఏర్పాట్లు చేసింది. అమ్మవారి ఆలయం వద్ద నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా భక్తులు, కమిటీ సభ్యులు పగటి వేషాలు వేసి వీధుల్లో సందడి చేశారు. నాలుగు రోజుల పాటు జాతర నిర్వహిస్తున్నామని, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు పెంట సంజీత్‌కుమార్, ఎస్.రూప్‌సుందర్, బి.ఉమాకాంత్, శివకుమార్, బమ్మిడి షణ్ముఖరావు, నెయ్యిల భగీరథి, పెంట నవీన్, విజయ్ పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

కొత్తూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నిర్వాసిత గ్రామం మెట్టూరు బిట్-2 పాడలిలో ఉమా కాశీ విశ్వేశ్వర ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా రెండో రోజు శుక్రవారం సాముహిక కుంకుమ పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. దార్లపూడి వెంకట సీతారామ శర్మ పర్యవేక్షణలో వేద పండితులు పూజలు చేయించారు.

పని గంటల పెంపు తగదు

టెక్కలి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): కార్మికుల పని గంటలు ఎనిమిది నుంచి 12కు పెంచుతూ రాష్ట్ర మంత్రి వర్గం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు నంబూరు షణ్ముఖరావు డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరశిస్తూ స్థానిక చిన్నబజారు వీధి వద్ద కార్మికుల సమావేశంలో మాట్లాడారు. పనిగంటలు పెంచడం దుర్మార్గమైన చర్యన్నారు. కార్మికుల వేతన సవరణ, సంక్షేమం చూడని పాలకులు పనిగంటలు పెంచడం దారుణమని అన్నారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శంకర్, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

మనువాద విధానాలను నిరసిద్దాం

పలాసరూరల్,జూన్6 (ఆంధ్రజ్యోతి):విప్లవ సాంస్కృతికోద్యమాన్ని బలోపేతం చేయాలని.. మనువాద కార్పొరేట్ ఫాసిజాన్ని ప్రతిఘటిద్దామని అరుణోదయ జిల్లా కమిటీ అధ్యక్షుడు సొర్ర రామారావు పిలుపునిచ్చారు. బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం అరుణోదయ సంస్థల విలీనసభ కరపత్ర ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 8న శ్రీకాకుళంలో జరిగే కళా ప్రదర్శనలో ప్రజాసంఘాలు పాల్గొనాలని కోరారు.

భారీ వర్షంతో రైతులకు ఊరట


రెంటికోట కాలనీ వద్ద కురుస్తున్న వర్షం

పలాస రూరల్, జూన్6 (ఆంధ్రజ్యోతి): పలాస మండలంలో శుక్రవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా ఎండ వేడిమితో అల్లాడిన ప్రజానీకానికి భారీ వర్షం ఎంతో ఉపశమనం కలిగించింది. ప్రస్తుతం ఖరీఫ్ సీజను ప్రారంభం కానున్న నేపథ్యంలో వర్షాలు కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జంట పట్టణాల్లో...

పలాస, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 3.30 నుంచి ఐదు గంటల వరకూ కుండపోతగా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయ మయ్యాయి. మూడు రోజులుగా తీవ్ర ఎండలు చూసిన ప్రజలు వర్షంతో ఊరటచెందారు. కాలువల్లో ప్రవహించాల్సిన నీరంతా రోడ్లపైకి చేరడంతో ప్రజలు అవస్థలకు గురయ్యారు.


పలాస రైల్వేస్టేషన్ రోడ్డులో వర్షపు నీరు

ఎల్ఎన్‌పేటలో...

ఎల్.ఎన్.పేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. బలమైన గాలులతో సుమారు గంటపాటు వర్షం కురవటంతో రోటరీనగర్, జంగాలవలస వీధి రోడ్లపై నీరు ప్రవహించింది. రెండు రోజుల నుంచి తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో ఇబ్బందులకు గురైన వృద్ధులు, చిన్నారులు భారీ వర్షంతో ఉపశమనం పొందారు.

న్యూస్ బాక్స్

దరఖాస్తుల ఆహ్వానం

కొత్తూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన కేజీబీవీ వసతి గృహంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఎ.గోవిందరావు తెలిపారు. హాస్టల్‌లో 100 సీట్లు ఉన్నాయని.. 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు వివిధ పాఠశాలల్లో చదువుతున్న బాలికలు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని చెప్పారు.

నేటి నుంచి విత్తనాల పంపిణీ

ఎల్.ఎన్.పేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్ పంటకు సంబంధించిన వరి విత్తనాలు శనివారం నుంచి పంపిణీ చేయనున్నట్టు వ్యవసాయాధికారి పి.లతాశ్రీ తెలిపారు. మెట్టు, పల్లపు ప్రాంతాల్లో రైతులకు అవసరమైన వరి విత్తనాలను ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారం రాయితీపై అందించనున్నట్టు చెప్పారు. అవసరమైన రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం పట్టుకొని గ్రామ సచివాలయాల వద్దకు వెళ్లాలని సూచించారు.

పశుగ్రాస విత్తనాలు..

పాతపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పశుగ్రాసం విత్తనాలు 50శాతం రాయితీపై పంపిణీ చేయనున్నామని పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ మంచు కరుణాకరరావు తెలిపారు. సీది గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సాగుతో పశుగ్రాసం పెంపకంపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుగ్రాసం పెంపకంతో పాడి రైతాంగం అధిక దిగుబడులు సాధించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు, సిబ్బంది, పాడి రైతాంగం పాల్గొన్నారు.

అల్లుడి ట్యాక్స్ పేరుతో విష ప్రచారం తగదు

పలాస, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అల్లుడి ట్యాక్స్ పేరుతో మాజీ మంత్రి విషం కక్కుతున్నారని, దీన్ని నిరూపిస్తే తాను రాజకీయంగా శాశ్వతంగా తప్పుకోవడంతో పాటు నడి రోడ్డు మీద గుండు కొట్టించుకుంటానని.. దీనికి మాజీ మంత్రి సిద్ధమేనా అని జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పీరుకట్ల విఠల్‌రావు సవాల్ విసిరారు. ఈ మేరకు శుక్రవారం మధ్యాహ్నం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాజీ మంత్రి అప్పలరాజు చేస్తున్న ఆరోపణలపై మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు మంత్రి అన్న చేసిన సెటిల్‌మెంట్లు తమ వద్ద ఆధారాలతో ఉన్నాయని అన్నారు. నల్లబొడ్లూరు కొండను రూ.4 కోట్లకు అమ్ముకోవడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఎంజీ లేఅవుట్‌లో పది శాతం కమీషన్ రైతుల వద్ద కొట్టారని ఆరోపించారు. ఇకనైనా అబద్ధపు మాటలు ఆపి అభివృద్ధికి సహకరించాలని, లేదా తన సవాల్‌కు స్పందించాలని విఠల్‌రావు సూచించారు.

విద్యాభివృద్ధికి పెద్దపీట

వజ్రపుకొత్తూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు అన్నారు. నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు అందించాల్సిన పుస్తకాలు, బ్యాగులు, ఇతర కిట్లను సంబంధిత హెచ్ఎంలకు శుక్రవారం అందించారు. వజ్రపుకొత్తూరు హైస్కూల్ ఆవరణలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు దశరథి, వెంకటేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌చార్జి అరసవెల్లి ఉమామహేశ్వరరావు, నాయకులు ఆకుల పాపారావు, రెల్ల దానయ్య పాల్గొన్నారు.

సీతారామ కల్యాణం


సీతారామ కల్యాణంలో పాల్గొన్న అర్చకులు

నరసన్నపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జమ్ము గ్రామంలోని శ్రీరామ మందిరంలో జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి సందర్భంగా శుక్రవారం సీతారామ కల్యాణం, పట్టాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. మావుడూరి జగదీష్‌బాబు, సత్యనంద్ ఆధ్వర్యంలో సత్యవరం రుత్వికులు విఘ్నేశ్వర పూజ, మండపరాధన చేశారు. అనంతరం సీతారామ కల్యాణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్త వాన గోవింద రాజులు, డా.రెడ్డి సంధ్య పాల్గొన్నారు.

పోలీసు జాగిలాలతో వాహన తనిఖీలు

పాతపట్నం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రా, ఒడిశా సరిహద్దు ప్రాంతంలో సీఐ వి.రామారావు నేతృత్వంలో శుక్రవారం ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ చేరువలో గల అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద నార్కోటిక్ డాగ్‌ను వినియోగించి వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.